


# JUSTIFIED

**నిత్యత్వము నుండి నిత్యత్వమునకు** | నీతిమంతులుగా తీర్చెను | **నాలుగవ పాఠము**

సులభతరమైన బైబిలు బోధన కొరకైన ఒక సూత్రమేమనగా ఉపదేశకులు బోధించు అంశముతో విద్యార్థుల కుండిన సంబంధమును విద్యార్థులు బాగుగా గ్రహించు కొనునట్లు చేయుటకు ఉపదేశకులు సమర్థులు కావలసియున్నది. ఆత్మసంబంధమైన సంగతులను గూర్చిన కష్టతరమైన అంశములను సులభతరము చేయుటలో అపొస్తలుడైన పౌలు ఆరితేరినవాడు. మానవుని సృష్టించుటలో దేవుని యొక్క ఉద్దేశమును గూర్చియు, ఆ ఉద్దేశమును కొనసాగించుట కొరకైన దేవుని ఏర్పాటును గూర్చియు అతడు చెప్పిన సారాంశము ఈ క్రింది విధముగా ఉన్నది. ఈ అంశమునకు మనము ఎట్లు సంబంధించి యున్నామో చూచుట సులభమే.

*"దేవుని ప్రేమించువారికి. అనగా ఆయన సంకల్పముచొప్పున పిలువబడిన వారికి మేలు కలుగుటకై సమస్తమును సమకూడి జరుగుచున్నవని యెరుగుదుము. ఎందుకనగా తన కుమారుడు అనేక సహోదరులలో జ్యేష్ఠుడగునట్లు, దేవుడెవరిని ముందు ఎరిగెనో, వారు తన కుమారునితో సారూప్యముగల వారవుటకు వారిని ముందుగా నిర్ణయించెను. మరియు ఎవరిని ముందుగా నిర్ణయించెనో వారిని పిలిచెను ఎవరిని పిలిచెనో వారిని నీతిమంతులుగా తీర్చెను. ఎవరిని నీతిమంతులుగా తీర్చెనో వారిని మహిమపరచెను."* *రోమా. 8:28-30*

నాలుగు విభిన్న పరిస్థితులలో మానవుని కొరకు దేవుడు అనుగ్రహించు దానిని వర్ణించుటకు పౌలు నాలుగు మాటలను మాత్రమే ప్రయోగించెనని ఈ లేఖన భాగమును గూర్చిన ముందు పఠనముల నుండి మనము జ్ఞాపకము చేసుకొందము. కాలమునకు ముందు నిత్యత్వములో మనకొరకైన దేవుని ఉద్దేశ్యములను గూర్చి దేవుడు ఆలోచించిన దానిని తెలియజేయుటకు ముందుగా నిర్ణయించెను అను మాటను అతడు ప్రయోగిం చెను. ముందుగానే గుర్తించుటయని ఆ మాటయొక్క భావము. దేవుని ప్రేమించు వారందరును ఆయన యొక్క బిడ్డలుగా ఉండవలెనని దేవుడు ముందే సంకల్పించెను. లేక ముందే ఎరిగెను (ఎఫెసీ. 1:3-6). సాతాను పరిపాలన క్రిందనున్న లోకమను పరిధిలో "ఆదామునందు" ఉన్నవారికి దేవుడు అనుగ్రహించుదానిని సంక్షేపించుటకు పౌలు పిలిచెను అను మాటను ప్రయోగించెను. దేవుడు వారిని సువార్త ద్వారా పిలుచుచున్నాడు (2 థెస్స. 2:14).

క్రైస్తవులమైన మన కొరకు "క్రీస్తునందు" దేవుడు చేసిన దానిని క్లుప్తీకరించుటకు నీతిమంతులుగా తీర్చెను అను మాటను పౌలు ఎన్నుకొనెను. సాధారణముగా, నీతిమంతులుగా తీర్చెను అను మాట సరిగా చేయుట లేక సరియైన వారని ప్రకటించుటయని అర్థమిచ్చును. క్రైస్తవులమైన మనము యేసు రక్తమునందలి విశ్వాసము ద్వారా నడుచు కొనుచున్నాము. మరియు, దేవుడు మనలను నీతిమంతులుగా ఎంచుచున్నాడు. "మనము ఆయన యందు దేవుని నీతియగునట్లు పాపమెరుగని ఆయన (యేసు)ను మనకోసము పాపముగా చేసెను" అని చెప్పి పౌలు ఈ బోధను సులభతరము గావించెను (2 కొరింథీ. 5:21).

మన పరలోకపు తండ్రి విషయములో సరియైన వారముగ నుండుటకు క్రైస్తవులమైన మనకు రెండే రెండు మార్గములు గలవు. ప్రతి విషయమును సరిగాచేయుట ఒకటి, విశ్వాసము ద్వారా నడచుకొని దేవుని నీతిదానమును అంగీకరించుట రెండవది (రోమా. 3:27; 5:17). మనమందరమును పాపముచేసి, దేవుడు అనుగ్రహించు మహిమను పొందలేక పోవుచున్నాము. గనుక దేవుని యొక్క నీతిదానము కొరకు మనము తప్పక ఎదురు చూడవలెను (రోమా. 3:23). అబ్రాహామువలె మనమును విశ్వాసము ద్వారా నడుచుకొని దేవునిచేత నీతిమంతులుగా ఎంచబడవలసియున్నది (రోమా. 4:1-3). దేవుడు మనలో నీతిని కనుగొనక పోయినయెడల దేవుని యొక్క ఉగ్రత ప్రత్యక్ష పరచబడును. కాబట్టి, దేవుని యొద్ద నుండి ఇతరమైన కృపలు ప్రవహించుటకు ముందుగా కావలసినది(pre-requisite) దేవుని నీతియే (రోమా. 1:17; 5:21).

నీతిమత్వారోపణ అను బోధ పనిచేయు విధము ఈ క్రింది లేఖనములో బయలు పరచబడియున్నది.

*"ఏ భేదమును లేదు అందరును పాపము చేసి దేవుడు అనుగ్రహించు మహిమను పొందలేకపోవు చున్నారు. కాబట్టి, నమ్మువారు ఆయన కృప చేతనే, క్రీస్తుయేసు నందలి విమోచనము ద్వారా ఉచితముగా నీతిమంతులని తీర్చబడుచున్నారు. పూర్వము చేయబడిన పాపములను దేవుడు తన ఓరిమివలన ఉపేక్షించినందున, ఆయన తన నీతిని కనుబరచ వలెనని క్రీస్తుయేసు రక్తమునందలి విశ్వాసముద్వారా ఆయనను కరుణా ధారముగా బయలు పరచెను. దేవుడిప్పటి కాలమందుతన నీతిని కనుబరచు నిమిత్తము, తాను నీతిమంతుడును యేసునందు విశ్వాసము గలవానిని నీతిమంతునిగా తీర్చువాడునై యుండుటకు ఆయన ఆలాగు చేసెను."* *రోమా. 3:23-26*

క్రైస్తవులు దేవుని కరుణాపీఠముపై నివసింతురు. హెబ్రీ 9:5 లోని కరుణాపీఠము, పై లేఖనములో చెప్పబడిన కరుణాధారము అనుమాట ఒకే గ్రీకు పదము నుండి వచ్చినవి. యేసు రక్తము నందలి విశ్వాసము ద్వారా క్రైస్తవులమైన మనము నడచు కొనుచున్నందున ఆయన యొక్క సిలువ మరణము మన పాపములకు కరుణాధారము (propitiation) లేక శాంతికరమై

(appeasement)యున్నది. “అయితే ఆయన వెలుగులో ఉన్న ప్రకారము మనమును వెలుగులో నడచియెడల మనము అన్యోన్య సహవాసముగలవారమై యుందుము. అప్పుడు ఆయన కుమారుడైన యేసుక్రీస్తు యొక్క రక్తము ప్రతిపాపమునుండి మనలను పవిత్రులుగా చేయును” అని చెప్పి అపొస్తులుడైన



యోహాను ఇదే బోధను వ్యక్తపరచెను (1 యోహాను 1:7). “యేసు మన యొక్క అపరాధముల నిమిత్తము అప్పగింపబడి మనము నీతిమంతులుగా తీర్చబడుటకై లేపబడెను” అని అపొస్తులుడైన పౌలు ప్రకటించెను (రోమా. 4:25). ఘనమైనట్టియు, అద్భుతమైనట్టియునైన ఈ బోధ యొక్క ఫలితము “క్రీస్తు యేసునందున్న వారికి ఏ శిక్షావిధియు” లేదు అనునది (రోమా. 8:1). ముందు పాఠములో మనము చదువుకొనిన క్రొత్తనిబంధన అమలు జరుపబడుటకు “ఏ శిక్షావిధియు లేని” ఈ స్థితి అవసరమై యున్నది.

దేవుని యొక్క జీవనియమము విషయములో మనము కలిగియున్న అజ్ఞానము మరియు బలహీన శీలములకు బదులు క్రైస్తవులమైన మనము దేవునితో “క్రీస్తు నందు” సమాధానకరమైన సహవాసము అనుభవించుటకు విశ్వాసము ద్వారా నీతిమంతులుగా తీర్చబడుట అను బోధ మనకు అనుమతినిచ్చును (రోమా. 5:1-2). మనయొక్క అవినీతిని సరిచేసుకొనుటకు దేవుని నీతిని దృష్టించవలసిన అవసరము మనకున్నది. అయితే, నీతిమంతులుగా తీర్చబడకుండగా మనము దేవునిని సమీపింపజాలము. న్యాయము కొరకైన ఒక ప్రమాణమును మనము కలిగియుండుటకు క్రీస్తుద్వారా దేవునినీతి ప్రత్యక్షపరచబడియున్నది. దేవుని న్యాయమును మన జీవితములలో మార్గదర్శకము (guide-on barrier)గా మనము వినియోగించుకొందుము (రోమా. 3:4).

క్రైస్తవులమైన మనము కొన్నింటిలో పాపముచేయుట వెంటనే మానివేయ సమర్థులమైనను, కోపము, హృదయకాఠిన్యము అనువాటిని జయించుటకు ఎక్కువ కాలము పట్టును. క్రీస్తు ఎంతటి సంపూర్ణుడో అంతటి సంపూర్ణులుగా భూమిపై మనమెన్నడును కాలేమేమో! కాని, మనము మన అవినీతిని సరిదిద్దుకొనుటకు ప్రయత్నించుచుండగా “ఆయన నీతిమంతుడైయుండి నట్లుగా” మనమును నీతిమంతులమని ఎంచబడుదుము. మరియు మనము నీతిని అనుసరించుదుము (1 యోహాను 3:7). విశ్వాసము ద్వారా నీతిమంతులుగా తీర్చబడుట అనుబోధ మన మానసిక వాతావరణమునకు “క్రీస్తునందు” అత్యంత విలువ గలదైయున్నది. దేవుడు, క్రీస్తు, పరిశుద్ధాత్మ మరియు ఇతరులైన పరిశుద్ధుల సముఖములో సహా మనలనుగూర్చి మనము సిగ్గుపడనవసరము (ashamed) లేదు. “దోషారోపణతో కుమిలిపోము (guilt ridden).” దేవుడు మనలను నీతిమంతులుగా తీర్చునని మనము నమ్మినయెడల మన బలహీనతలను ఒప్పుకొనుటలో మనము దోషారోపణ అనుభవింపము. మన బలహీనతలను గూర్చి దేవునితోను, ఇతరులతోను మనము మాటలాడ వలసియున్నది. మనయొక్క బలహీనతలను యథాతథముగా దృష్టించుటకు నీతిమత్వారోపణ మనలను అనుమతించును. మన బలహీనతలను కట్టుదిట్టముగా సరిచేసుకొనుటకు ఇదియే ఏకైక మార్గము.

దేవుని సన్నిధిలో నడువగలుగునట్లు మనలను నీతిమంతులుగా తీర్చు విశ్వాసము, దేవుడున్నాడని ఒప్పుకొనుట కంటె మిన్నయైనది. “విశ్వాసమనునది నిరీక్షింపబడువాటి యొక్క నిజస్వరూపమును అదృశ్యమైనవి ఉన్నవనుటకు ఋజువునైయున్నది” అని బైబిలులో నిర్వచింపబడెను (హెబ్రీ. 11:1). మన కొరకైన దేవుని సంకల్పమునకు సంబంధించి మన విశ్వాసము మన యొక్క వర్తమాన, భవిష్యత్ జీవితములకు సంబంధించి యున్నది. “విశ్వాసము లేకుండ దేవునికి ఇష్టుడైయుండుట అసాధ్యము. దేవుని యొద్దకు వచ్చువాడు దేవుడున్నాడనియు, తన యొద్దకు వచ్చువారికి ప్రతిఫలము దయ చేయు వాడనియు నమ్మవలెనుగదా”యని హెబ్రీ గ్రంథకర్త చెప్పెను (హెబ్రీ. 11:6). దేవుడు ఉన్నాడని మరియు ఆయన ఇపుడు క్రీస్తునందు మనకు ప్రతిఫలము ఇచ్చుచున్నాడనియు మన విశ్వాసము ఒప్పుకొనవలసియున్నది.

ప్రేమవలె విశ్వాసము కూడ మన ఉద్వేగ వైఖరిలో ఒక భాగము. దాని నుండి, మత్తయి 5:3-12 లో చెప్పబడిన ధన్యతల వంటి ఆరోగ్యకరమైన ఇతర వైఖరులు వృద్ధి చెందును. మన విశ్వాసము మనలను కదిలించును. ఏలయనగా మనము మన జీవితములతో సహా ఆయన యందు నమ్మికయుంచుదుము (రోమా. 1:5). క్రీస్తు రక్తము నందు ఈవిధమైన విశ్వాసమును మనము కలిగియుండినట్లు దేవుడు మనలను కనుగొనిన యెడల ఆయన మనలను నీతిమంతులుగా ఎంచును. దేవుని కృప నీతి ద్వారా “క్రీస్తునందు” ఏలును (రోమా. 5:21). ఈవిధమైన పరిస్థితులలో మాత్రమే మన ఆంతర్యపురుషుడు శరీర దురాశలపై జీవమునందు ఏలగలుగును (రోమా. 5:18; 13:14).

మనయొక్క భౌతికదేహములలో మనము జీవించునంత కాలము దేవునితో సహవాసమును సంపాదించు కొనగలుగు నంతటి నీతిమంతులుగా గాని, పరిశు ద్ధులముగా గాని మన మెన్నడును కాజాలము. అందువలననే దేవుడు క్రియాన్యాయము లేదా ధర్మశాస్త్రవిధానము అనుదాని నుండి మనలను తొలగించి, కృప - విశ్వాసమూలమైన నీతివిధానమునకు (grace - faith system of righteousness) బదిలీచేసెను. “క్రీస్తునందు” ఇప్పుడే పరిశుద్ధులు, నీతిమంతులునైన దేవుని బిడ్డలుగా మనము జీవించగలుగునట్లు సాధ్యమౌటకు హేతువేమనగా దేవునియొక్క కృప మరియు క్రీస్తు రక్తము నందలి మన విశ్వాసము అను రెండిటి సమ్మేళనము. ఆలాగున మనతో వ్యవహరించుటకు దేవునికి న్యాయమాయెను. ఏలయనగా, యేసు సిలువపై దేవునినీతిని వెల్లడిపరచెను. దయచేసి, రోమా. 3:23-26 చదువుము.

క్రైస్తవులముగా మనలనుగూర్చి మనము చెప్పుకొను ప్రతిసంగతి మరియు మనము అనుభవించు ప్రతిహక్కు మనదే. ఏలయనగా, మనము “నీతిమంతులముగా తీర్చబడితిమి” మనము పరిశుద్ధులము. దాని భావమేమనగా, దేవుని దృష్టిలో మనము ప్రత్యేకింపబడినవారము (1 కొరింథీ. 1:2). మనము దేవునికి ప్రార్థించి, ఎచట స్తుతిగానము చేయుదుమో ఆ పరిశు ద్ధ స్థలములోనికి ప్రవేశించుటకే మనము నీతిమంతులముగా ఎంచబడితిమి (రోమా. 8:26-27; హెబ్రీ. 10:19; 13:15). దేవునియొక్క పరిశుద్ధ ఉగ్రతచేత దహించబడుదుమను భయము లేకుండగనే ప్రతీ ఆదివారమున ప్రభురాత్రి భోజనములో పాలుపొందుటవలన యేసుతో మనము సహవాసము అనుభవించుదుము (అపొ.కా. 20:7; 1 కొరింథీ. 11:23-29). యేసు అను దేవుని కానుకను మనము అంగీకరించినందున మన కానుకలు దేవునికి అంగీకారమగును (రోమా. 12:1; 1 కొరింథీ.16:2). మనము నీతిమంతులముగా తీర్చ బడినందున పరిశుద్ధాత్ముడు మన దేహములలో నివసించగలిగి మన అంతరంగపురుషుని బలపరచును (1 కొరింథీ. 6:19; ఎఫెసీ. 3:16).

*“ఇట్లుండగా ఏమందుము? దేవుడు మన పక్షముననుండగా మనకు విరోధి ఎవడు? తన సొంతకుమారుని అనుగ్రహించుటకు వెనుకతీయక మన అందరికొరకు ఆయనను అప్పగించినవాడు ఆయనతోపాటు సమస్తమును మనకెందుకు అనుగ్రహింపడు?” రోమా. 8:30-31*

దేవునితో మనము సహవాసము కలిగియుండని యెడల నిత్యజీవమును కలిగి యుండలేము. మనము నీతిమంతులము కానియెడల దేవునితో సహవాసమును అనుభవింపలేము. “నీతి మంతుడు విశ్వాసమూలముగా జీవించును” అని చెప్పి అపొస్తులుడైన పౌలు మన సమస్యకు జవాబును అనుగ్రహించెను (రోమా. 1:17).

“కాలము గతించిపోయిన” తరువాత నిత్యత్వములో విశ్వాసులైన క్రైస్తవులకు దేవుడు అనుగ్రహించుదానిని క్లుప్తీకరించుటకు **“మహిమపరచెను”** అను మాట ఎట్లు అత్యంత శ్రేష్టమైనదో మన తదుపరి పాఠములో మనము నేర్చుకొందుము.

**A. సరియైన జవాబు క్రింద గీత గీయుము.**

**1. మానవాళికి మరణము సంప్రాప్తమవుటకు హేతువు.**

a. మానవులు పాపముతో పుట్టిరి.

b. అందరును పాపము చేసిరి.

**2. మరణమనగా మన దేహముల నుండి మన ఆత్మలు ఎడబాటు చెందుట. అయితే, అది వివరించు ఇంకొక విషయమేమనగా:**

a. దేవుని నుండి వేరయిన యొక నీచస్థాయి జీవితము.

b. పుట్టినప్పుడు పిల్లలు కలిగియుండు స్థితి.

**3. ఆదాము హవ్వలు ఎట్లు నిర్మింపబడిరనగా.**

a. మంచి చెడ్డల తెలివి కలిగియుండిన వారుగా.

b. మంచి చెడ్డల తెలివి లేకుండగా.

**4. ఆదాము క్రీస్తుకు గురుతై యుండుటకు హేతవు.**

a. అతడు లోకములోనికి ముందుగా వచ్చెను.

b. వారిరువురును రెండు విధములైన ప్రజలను సూచించుదురు.

**5. దేవుని యొక్క రాజ్యములోని జీవితమును అనుభవించుటకు ఈడు వచ్చిన ప్రతి వ్యక్తి తప్పక చేయవలసినదేమనగా.**

a. తిరిగి జన్మింపవలెను.

b. సువార్తను విని, మారుమనస్సు పొందవలెను.

**B. ఈ పాఠములో ఎత్తి వ్రాయబడిన లేఖనముల నుండి ఖాళీలను పూరింపుము.**

1. "పరలోకసంబంధి యెట్టివాడో ..........................................................................................అట్టివారే."

2. "మనము ..........................................................................................వలన (క్రీస్తు) మరణములో పాలు పొందుటకై ఆయనతో కూడ పాతిపెట్టబడితిమి."

3. " ..........................................................................................యొక్క మహిమను పొందవలెనని ఆయన మా సువార్త ద్వారా మిమ్మును పిలిచెను."

4. "మనుష్యులందరు .......................................................................................... చేసినందున, మరణము అందరికిని సంప్రాప్తమాయెను"

5. "మరియు ఎవరిని ముందుగా నిర్ణయించెనో వారిని.........................................................................."

**C. సత్యమా? అసత్యమా? దయచేసి, సరియైన జవాబుకు టిక్కు పెట్టుము.**

1. మనము మంచిచెడ్డల తెలివిని కలిగియుండ వలెనని దేవుడు కోరియుండలేదు. (సత్యము) (అసత్యము)

2. యేసు లోకము అను పరిధిని పాలించును. (సత్యము) (అసత్యము)

3. మనుష్యులందరు పాపము చేసియున్నందున మరణము అందరికి సంప్రాప్తమాయెను. (సత్యము) (అసత్యము)

4. యేసు వచ్చుటకు పూర్వము మానవాళి కలిగియుండిన నాలుగు గొప్ప సమస్యలలో మోషే ధర్మశాస్త్రము ఒకటి. (సత్యము) (అసత్యము)

5. యేసు యొక్క చిత్తమునకు వ్యతిరేకముగా యూదా నాయకులు ఆయనను చంపిరి. (సత్యము) (అసత్యము)

6. క్రొత్తగా జన్మించినప్పుడు క్రైస్తవులు మంచిచెడ్డల తెలివి నుండి విడుదల పొందిరి. (సత్యము) (అసత్యము)

7. లోకములోని మనుష్యులను సువార్త ద్వారా దేవుడు పిలుచుచున్నాడు. (సత్యము) (అసత్యము)

8. లోకములో "ఆదామునందు" ఉన్న యుక్తవయస్కులైన మనుష్యుల యజమాని పాపము. (సత్యము) (అసత్యము)

9. క్రొత్తగా జన్మించుటకు అవసరమైనదంతయు నమ్మిక మరియు మారుమనస్సు. (సత్యము) (అసత్యము)

10. ఈ కోర్సు పూర్తి చేయగల ఈడు వచ్చినవారు పాపము చేసియుండవచ్చు. (సత్యము) (అసత్యము)

ఈ కోర్సును పూర్తిచేయగోరు వారు మాకు వ్రాయండి మీరు పూర్తిచేసిన ప్రశ్నావళి మాకు పంపిన యెడల వాటిని దిద్ది తిరిగి మీకు పంపగలము.